# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 25.01.2025 | 24 క్యారెట్లు 88,667.00 | కిలో వెండి 98,787.00 | 31 °C | సంపుటి:3 | సంచిక:94

www.vishalabharati.com





# 20 లక్షల ఇళ్లు ఇవ్వండి

## పీఎంఏవై కింద రాష్ట్రానికి మంజూరు చేయండి

- దేశ పట్టణ జనాభాలో 8 శాతం తెలంగాణలోనే
- హైదరాబాద్‌కు రూ.55వేల కోట్లు ఇవ్వండి
- మెట్రో విస్తరణకు రూ.24వేల కోట్లు అవసరం
- మూసీ అభివృద్ధికి రూ.10,000 కోట్ల ఇవ్వాలి
- హైదరాబాద్, వరంగల్ డ్రైనేజీ స్కీలంకు నిధులకు కేటాయించాలి
- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ వినతి
- రాష్ట్రానికి సహకరిస్తాం..కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్

విశాలభారతి, స్టేట్ బ్యూరో: ప్రధానమంత్రి ఆవాస్ యోజన(అర్బన్) 2.0 కింద రాష్ట్రానికి 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు రాష్ట్రంలో పురపాలక సంస్థల అభివృద్ధికి కేంద్రం సహకారం అందించాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు రూ.55,652 కోట్లు ఆర్థిక సాయం చేయాలన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో పీఎంఏవై(యు), పట్టణాభివృద్ధి, విద్యుత్తు శాఖలపై సంబంధిత ఉన్నతాధికారులతో కేంద్ర మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దేశ పట్టణ జనాభాలో 8 శాతం తెలంగాణలో ఉన్నారని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన(అర్బన్) 2.0లో చేరిన తొలి రాష్ట్రమైన తెలంగాణ ఇళ్ల నిర్మాణానికి

..మిగతా 2 లో

# రేపటి నుంచే రైతుభరోసా నిధులు

## రాష్ట్రవ్యాప్తంగా పంట భూముల సర్వే



- రికార్డుల్లో కోటి 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి
- సాగులో లేని భూమి 10 లక్షల ఎకరాల పైనే
- కోటి 40 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- పథకం కోసం రూ.8,500 కోట్లు కావాలి
- లెక్కలు సిద్ధం చేసిన అధికారులు
- 10 లక్షల మంది కూలీలకు ఆత్మీయ భరోసా

“ రైతులకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 12 వేలు ఇస్తామని రేవంత్ సర్కార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఖరీఫ్, రబీ రెండు విడతలుగా ఈ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. తొలి విడతగా.. రేపటి నుంచి (జనవరి 26) రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కాగా, సాగులో ఉన్న భూములకు మాత్రమే పంట పెట్టుబడి సాయం అందిస్తామని సర్కార్ ఇది వరకే స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారులు సాగు భూముల లెక్కలు తేల్చారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుకు యోగ్యమైన భూములు 1.40 కోట్ల ఎకరాలు ఉన్నట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీటికి సీజన్‌కు ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా ఇచ్చేందుకు మొత్తం రూ.8,500 కోట్లు అవుతుందని అంచనా వేశారు.

విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఈ మేరకు నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖకు ఇప్పటికే ఆదేశాలు వెళ్లినట్టు తెలిసింది. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కొండలు, గుట్టలు, స్థిరాస్తి వెంచర్లు, హైవేలు ఇతర ప్రభుత్వ అవసరాల కోసం స్వాధీనం చేసుకున్న భూముల వివరాలను గుర్తించారు. ఇటువంటి భూములు దాదాపు 10 లక్షల

..మిగతా 2 లో

# తెలంగాణ గేమ్‌ఛేంజర్ ఆర్ఆర్ఆర్



- అత్యాధునిక సౌకర్యాలతో ఫ్యూచర్ సిటీ
- నిర్మాణ రంగానికి అధిక ప్రాధాన్యం
- టెక్నాలజీని అందిపుచ్చుకుంటేనే భవిష్యత్
- ఏసీఈ-టెక్ ఎగ్జిబిషన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

2 లో


# ఏడాదిలోనే రూ. 2,19,182 కోట్లు

- దావోస్ సదస్సు నుంచి రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులివి
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెచ్చింది రూ.25,750కోట్లే
- పీసీసీ చీఫ్‌మహేశ్ కుమార్‌గౌడ్
- గూడెం మహిపాల్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం
- నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని వివరణ



విశాలభారతి, స్టేట్ బ్యూరో: కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు కేవలం రూ.25,750 కోట్లు మాత్రమేనని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. తమ ఏడాది పాలనలో ఏకంగా రూ.2,19,182 కోట్ల మేరకు పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. దీనిపైన చర్చకు సిద్ధమా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆయన సవాల్ విసిరారు. కాంగ్రెస్ నుంచి

..మిగతా 2 లో



# కేజ్రీవాల్ హత్యకు కుట్ర..!

- కేంద్ర ప్రభుత్వంపై ఆప్ సంచలన వ్యాఖ్యలు
- భద్రత కల్పించాలని ఈసీకి రిక్వెస్ట్

విశాలభారతి, నేషనల్ బ్యూరో: ఢిల్లీ పోలీసులు, కేంద్ర ప్రభుత్వంపై ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన వ్యాఖ్యలు చేసింది. అరవింద్ కేజ్రీవాల్ ను చంపేందుకు ఢిల్లీ పోలీసులు, కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ



# కౌశిక్ రెడ్డిపై జనాగ్రహం

- కోడిగుడ్లు, టమాటాలతో దాడి
- కుర్చీలతో దాడి చేసిన ఎమ్మెల్యే అనుచరులు
- కమలాపూర్ గ్రామసభలో ఉద్రిక్తత
- కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం

విశాలభారతి, స్టేట్ బ్యూరో: కరీంనంగర్ జిల్లా కమలాపూర్ ప్రజాపాలన గ్రామ సభలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై సభకు వచ్చిన పలువురు కోడిగుడ్లు, టమాటాలు విసిరారు. వెంటనే ఎమ్మెల్యే గన్‌మెన్లు ఆయనను పక్కకు తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. కమలాపూర్ గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్ల గురించి అధికారులను ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చామని చెప్పుకొచ్చారు. అయితే గత ప్రభుత్వ పథకాలపై మాట్లాడుతున్న కౌశిక్ రెడ్డిని కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే గ్రామసభలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కాంగ్రెస్ బీఆర్ఎస్ నేతలు పరస్పరం

..మిగతా 3 లో



# నిర్లక్ష్యం వల్లే మేడిగడ్డ కుంగింది

- 2019లోనే సమస్యలొచ్చాయి
- మేము చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదు
- కమిషన్ ఎదుట తేల్చేసిన ఎల్ అండ్‌టీ అధికారులు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: మేడిగడ్డ ఆనకట్టలో నీరు నిల్వ చేసిన మొదటి సీజన్ తర్వాత 2019లోనే సమస్యలు వచ్చాయని, వాటిని అప్పుడే పరిష్కరించి ఉంటే ఇంత దాకా వచ్చేది కాదని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ప్రతినిధులు తెలిపారు. డిజైన్ల, డ్రాయింగ్స్ సమయంలో అంచనా వేసిన ప్రవాహవేగం

..మిగతా 2 లో



# కిడ్నీ రాకెట్ వెనుక కార్పొరేట్ ఆసుపత్రులు

- సీఐడీ విచారణకు సర్కారు ఆదేశాలు
- ఎవ్వరినీ వదలొద్దన్న మంత్రి రాజనర్సింహ

విశాలభారతి, స్టేట్ బ్యూరో: నగరంలోని అలకనంద ఆస్పత్రిలో వెలుగు చూసిన ‘కిడ్నీ రాకెట్’ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని మంత్రి

..మిగతా 2 లో

# గోదావరి నీళ్లను ఏపీ తరలించుకుపోతోంది

- నిమ్మకు నీరెత్తినట్లుగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం
- బనకచర్ల ద్వారా పెన్నా బేసిన్‌కు 200 టీఎంసీలు
- తుంగభద్రపై ఏపీ, కర్ణాటక కొత్త ప్రాజెక్టులు
- రేవంత్ గురుదక్షిణ చెల్లించుకుంటున్నారా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసం అయినా కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి విషయంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరి నీళ్లను పెన్నాకు తీసుకెళ్లేందుకు ఏపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. బనకచర్ల ఆపాలని



ఏపీకి కనీసం లేఖ కూడా రాయలేదన్నారు. “ఏపీ ప్రభుత్వం ఇప్పటికే పోలవరం రైట్

..మిగతా 2 లో

## గోదావరి–బనకచర్లకు సాయం చేయొద్దు

- తెలంగాణ హక్కులపై ప్రతికూల ప్రభావం
- కేంద్ర మంత్రులకు ఉత్తమ్ లేఖ
- ఇప్పటివరకూ చుక్క నీరు పోలేదు
- హరీశ్‌రావుకు బూటకపు ప్రకటనలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఫైర్

4 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
25.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# 20 లక్షల ఇళ్లు ఇవ్వండి

తరువాయి భాగం

సమగ్ర సమాచారం, ప్రణాళికతో సిద్ధంగా ఉన్నందున 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని సీఎం కోరారు. దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లో మెట్రో కనెక్టివిటీ తక్కువగా ఉందని, అందుకే మెట్రో ఫేజ్ 2 కింద ఆరు కారిడార్లు గుర్తించామని, వీటిలో అయిదింటికి డీపీఆర్‌లు పూర్తయ్యాయన్నారు. వీటి నిర్మాణానికి రూ.24,269 కోట్లు అందించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యం కింద చేపట్టి నిధులు కేటాయించాలని రేవంత్‌రెడ్డి విన్నవించారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి చేయూత ఇవ్వాలన్నారు. ఈ నదిలోకి మురుగునీరు చేరకుండా ఇరువైపులా కలిపి రూ.110 కిలోమీటర్ల పొడవునా కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణానికి రూ.10,000 కోట్లు ఇవ్వాలని నివేదించారు. హైదరాబాద్‌తో పాటు సమీపంలోని 27 పట్టణ స్థానిక సంస్థల్లో సమగ్ర మురుగునీటి నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేశామని, ఇందుకు రూ.17,212 కోట్లు ఖర్చవుతుందని, అమృత్ 2.0 లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా గుర్తించి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు

# కిడ్నీ రాకెట్ వెనుక కార్పొరేట్ ఆసుపత్రులు

తరువాయి భాగం

ఆదేశించారు. మరోవైపు ఈ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఆస్పత్రి ఛైర్మన్ సుమంత్, మరో వ్యక్తి గోపి సహా 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సుమంత్, గోపీని పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. గతంలో కిడ్నీ రాకెట్ కేసులో మంగళవారం సాయంత్రం ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి ద్వారా కొందరి పేర్లు, ఫోన్ నంబర్లు సేకరించారు. వీరంతా తమిళనాడు, కర్ణాటక నుంచి కిడ్నీ దాతలు, గ్రహీతల్ని తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. అలకనంద ఆసుపత్రిలో కిడ్నీమార్పిడి శస్త్ర చికిత్సలు గతంలోనూ జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు కనీసం 15 నుంచి 20 మంది వైద్యులు, ఇతర సిబ్బంది అవసరమవుతారు. చికిత్స చేయడానికి వైద్యులతోపాటు ఆపరేషన్‌కు ముందు, తర్వాత ఐసీయూ, ఆపరేషన్ థియేటర్‌లో నర్సులు, టెక్నీషియన్లు ఉండాలి. ఇంతమంది ఎక్కడి నుంచి వస్తున్నారనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. ఈ ఆసుపత్రి 9 పడకలతో ప్రారంభమైందని, ఇందులో ఎలాంటి ప్రత్యేక వసతులు లేవని రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారు.

# రేపటి నుంచే రైతుభరోసా నిధులు

తరువాయి భాగం

ఎకరాలకు పైగా ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. ప్రస్తుతం జరుగుతున్న గ్రామ సభల్లో సాగుకు యోగ్యం కాని భూముల సర్వే నెంబర్లను ఆన్‌లైన్‌లో బ్లాక్ చేసినట్లు తెలుస్తోంది. సాగులో లేని భూములను మినహాయించి మిగిలిన భూములకు రైతు భరోసా పెట్టుబడి సాయం అందించనున్నారు.
రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో దాదాపు కోటి 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూములన్నాయి. 69 లక్షల మంది రైతులు పట్టాదారులుగా ఉన్నారు. అయితే ఇందులో కొన్ని సాగులో లేని భూములున్నాయి. పట్టాలున్నా.. వాటిల్లో పంటలు వేయటం లేదు. ఫంక్షన్ హాల్స్, పెట్రోల్ బంకులు, హోటల్స్, పార్కింగ్ స్థలాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు వంటివి ఏర్పాటు చేసి ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయా భూములను గుర్తించిన అధికారులు.. వాటికి రైతు భరోసా సాయం ఇవ్వొద్దని డిసైడ్ అయ్యారు. ప్రాథమికంగా తేలిన లెక్కల ప్రకారం 10 లక్షల ఎకరాలకు పైనే సాగుకు పనికి రానివని గుర్తించారు. అవిపోగా.. మిగిలిన కోటి 40 లక్షల ఎకరాల కు రైతు భరోసా అందించనున్నారు.

# ఏడాదిలోనే రూ. 2,19,182 కోట్లు

తరువాయి భాగం

తాను, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు వస్తామని, బీఆర్‌ఎస్ నుంచి కేసీఆర్‌ను తీసుకొచ్చుకుంటారో.. లేకుంటే ఇంకెవరైనా ఎక్స్‌పర్ట్‌ను తీసుకొచ్చుకుంటారో కేటీఆర్ ఇష్టమని అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో 2019 వరకూ వచ్చిన పెట్టుబడులు సున్నా అని చెప్పారు. 2020లో రూ.500 కోట్లు, 2022లో రూ.4,250 కోట్లు, 2023లో రూ.21 వేల కోట్లు.. వెరసి పదేళ్లలో కేవలం రూ.25,750 కోట్ల మేరకు పెట్టుబడులు వచ్చాయన్నారు. అదే కాంగ్రెస్ ఏడాది పాలనలో.. 2024 జనవరిలో జరిగిన దావోస్ సదస్సులో రూ.40,232 కోట్లు, తాజా సదస్సులో రూ.1,78,950 కోట్ల మేరకు వివిధ కంపెనీలతో పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారితో దావోస్‌లోని తెలంగాణ పెవిలియన్ వద్ద రద్దీ ఏర్పడిందని చెప్పా రు. దావోస్‌లో కుదిరిన ఒప్పందాలతో రాష్ట్రంలో దాదాపు 75 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ సహా రాష్ట్రంలో రియల్ బూమ్ కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు కాంగ్రెస్ పార్టీ అభినందనలు తెలుపుతోందని ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. గ్రామ సభల్లో అర్హులైన లబ్ధిదారులను పార్టీలకు అతీతంగా ఎంపిక చేస్తున్నారని ఆయన చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో లబ్ధిదారుల ఎంపికను ఎమ్మెల్యేలే చేసేవారని ఆరోపించారు. ఇదిలా ఉండగా, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై తాను నియమించిన ద్విసభ్య కమిటీ పరిశీలన చేస్తోందని, కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత చర్యలు ఉంటాయని వెల్లడించారు.

# గోదావరి నీళ్లను ఏపీ తరలించుకుపోతోంది

తరువాయి భాగం

కెనాల్‌ను మూడింతలు పెంచింది. దీంతో 200 టీఎంసీల నీటిని బనకచర్ల ద్వారా పెన్నా బేసిన్‌కు తరలించే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు తుంగభద్ర నదిపై ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులు కట్టి పెద్దఎత్తున నీళ్లు తరలించుకుపోయే ప్రయత్నాలు చేస్తున్నాయి. కొత్త ప్రాజెక్టు చేపట్టాలంటే.. అనేక అనుమతులు కావాలి. కానీ ఇవేవీ లేకుండానే ఇవాళ ఏపీ ప్రభుత్వం గోదావరిబనకచర్ల ప్రాజెక్టును చేపట్టింది. 'మేం కొత్త ప్రాజెక్టులు కట్టుకుంటున్నాం.. నిధులివ్వండి' అంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు లేఖలు రాశారు. ఏడీబీ నుంచి రూ.40 వేల కోట్లు ఇప్పిస్తామని వాళ్లు మాట కూడా ఇచ్చారు. ఇంత జరుగుతుంటే ఈ ముఖ్యమంత్రి, నీటిపారుదలశాఖ మంత్రి ఏం చేస్తున్నారు? ఏపీ ప్రాజెక్టులను ఆపండని కనీసం ఒక్క ఉత్తరం కూడా రాయలేదు. సీఎం స్వయంగా వెళ్లి.. కేంద్ర మంత్రులను, ప్రధానిని కలిసి ఈ ప్రాజెక్టులను ఆపాలని అడిగే సోయి లేదా? బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణలో చేపట్టిన సీతారామసాగర్, సమ్మక్క సాగర్, కాళేశ్వరంలో 3వ టీఎంసీ, అంబేడ్కర్ వార్ధా ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగులో ఉన్నాయి. వీటికి క్లియరెన్సులు సాధించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. 2017లో ఏపీ ప్రభుత్వం గోదావరి నుంచి నీళ్లు తరలించే ప్రయత్నం చేస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆపింది. కృష్ణా, గోదావరి జలాలను పునఃపంపిణీ చేయాలని అప్పటి కేంద్ర మంత్రి ఉమాభారతికి నాటి సీఎం కేసీఆర్ లేఖ రాశారు. బీఆర్‌ఎస్ పోరాట ఫలితంగానే సెక్షన్ 3 కింద కృష్ణా జలాల వాటాను పునఃపంపిణీ చేయాలని బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌కు సుప్రీంకోర్టు అప్పగించింది.

# కేజ్రీవాల్ హత్యకు కుట్ర..!

తరువాయి భాగం

ఆరోపించింది. కేజ్రీవాల్ కు పంజాబ్ పోలీసులు కల్పించిన భద్రతను పునరుద్ధరించాలని ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు పేర్కొంది. కేజ్రీవాల్ భద్రతకు సంబంధించి ఢిల్లీ సీఎం ఆతిషీ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌లు ప్రెస్ కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. కేజ్రీవాల్ పై ఢిల్లీ పోలీసులు, కేంద్రం కుట్ర పన్నుతోందని అన్నారు. ఆయన్ని చంపేందుకు ఒకదాని వెనుక మరో ప్రయత్నం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. గతంలో కేజ్రీవాల్‌పై బీజేపీ కార్యకర్తలు దాడి చేశారని దర్యాప్తులో తేలినప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. కేజ్రీవాల్‌పై జరుగుతున్న దాడులపై కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే ఢిల్లీ పోలీసులు దృష్టి సారించడం లేదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే వారంతా ఇలా ప్రవర్తిస్తున్నారని నిప్పులు చెరిగారు.





# తెలంగాణ గేమ్‌ఛేంజర్ ఆర్‌ఆర్‌ఆర్

- అత్యాధునిక సౌకర్యాలతో ఫ్యూచర్ సిటీ
- నిర్మాణ రంగానికి అధిక ప్రాధాన్యం
- టెక్నాలజీని అందిపుచ్చుకుంటేనే భవిష్యత్
- ఏసీఈ-టెక్ ఎగ్జిబిషన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భవిష్యత్తులో తెలంగాణ దశదిశను మార్చే సూపర్ గేమ్ ఛేంజర్ ట్రిపుల్ ఆర్ నిర్మాణం చేయబోతున్నామని, అత్యాధునిక సౌకర్యాలు కలిగిన ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, మెట్రో విస్తరణ చేయబోతున్నట్లు రోడ్లు, భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం నుంచి మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో ప్రారంభమైన ఏసీఈ టెక్ ఎగ్జిబిషన్ ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ 21వ శతాబ్దంలో ఏ దేశమైనా, ఏ నగరమైన ఆధునికమైన మౌలిక వసతులు ఉంటేనే ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్యంగా ఎదుగుతుందని, అందుకే మా ప్రభుత్వం సైతం నిర్మాణ రంగానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. హైదరాబాద్ ఇవ్వాల ప్రపంచంలో వన్ ఆఫ్ ది బెస్ట్ ఇన్వెస్ట్మెంట్ డెస్టినేషన్. దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2025 సదస్సుల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఇంట్రెస్ట్ చూపిస్తున్నారని అన్నారు.
గతంలో ఎప్పుడూ లేని విధంగా దావోస్ లో ఇప్పటికే రూ.1.64 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మరిన్ని పెట్టుబడులు రానున్నాయి. ఈ పెట్టుబడులన్నీ కార్యరూపం దాల్చాలంటే మీ అందరి సపోర్ట్ కావాలన్నారు. ఇంజనీర్స్ కావాలి, ఆర్కిటెక్ట్స్ కావాలి, కన్ స్ట్రక్షన్ ఎక్స్ పర్ట్స్ కావాలి, ఈ అందరితో పాటు.. అడ్వాన్స్ డ్ ఎక్విప్‌మెంట్ ఉండాలి.. ఇవన్నీ అందించే వేదిక ఈ ఏసీఈ టెక్ అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తెలంగాణ దశదిశను మార్చే సూపర్ గేమ్ ఛేంజర్ ట్రిపుల్ ఆర్ నిర్మాణం చేయబోతున్నామని, మరెన్నో ప్రాజెక్టులు రాబోతున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఇవన్నీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్.. ఇవన్నీ ముందుకు తీసుకుపోవాలంటే నిర్మాణరంగంలో వచ్చిన అత్యాధునిక టెక్నాలజీ చాలా అవసరం అన్నారు. వేగంగా మారుతున్న నిర్మాణరంగ నైపుణ్యాలను మనం అందిపుచ్చుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు మనం స్థిరమైన భవిష్యత్తును అందించగలమని అన్నారు.
నిర్మాణరంగంలో రైజింగ్ లో ఉన్న తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో... ఇలాంటి కన్స్ట్రక్షన్ టెక్నాలజీ, ఎక్విప్‌మెంట్ ను పరిచయం చేసే ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేయడం నిజంగా చాలా సంతోషకరమన్నారు. ఈ ఏసీఈటెక్ ఎగ్జిబిషన్ పరిశ్రమలకు, నిర్మాణరంగ అవసరాలను తీర్చే వేదికగా.. తెలంగాణ భవిష్యత్తును, రాష్ట్ర నిర్మాణ రంగాన్ని కొత్తపుంతలు తొక్కిస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యువతకి స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. టాటా కన్సల్టెన్సీ భాగస్వామ్యంతో 65 ఐటిఐ లను ఆధునికరిస్తున్నామని, ఇందులో అడ్వాన్స్డ్ కోర్సులను అందిస్తున్నామని అన్నారు. ఆర్ అండ్ బీ పరిధిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ ద్వారా వేలాది మంది యువతను స్కిల్డ్ ఎంప్లాయిస్ గా తీర్చిదిద్దుతున్న ట్లు తెలిపారు. న్యాక్ ద్వారా ఇజ్రాయిల్, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తున్నామన్న మంత్రి కోమటిరెడ్డి హైదరాబాద్ లో 30 లక్షల మంది లేబర్ ఉన్నప్పటికీ కార్మికులు కావాలంటే బీహార్, ఉత్తర్ ప్రదేశ్ లేబర్స్ ను వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంస్థలు తమ ప్రోడక్ట్స్ లను ప్రదర్శించారు.

# ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత విజ్ఞాన్‌దే

- ఘనంగా విజ్ఞాన్ విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలు
- చదువు అంటే మార్కులే కాదు.. విలువలతో కూడిన విద్య
- ఎమ్మెల్సీ కోదండరాం
- సామాజిక బాధ్యతతో లావు రత్తయ్య విజ్ఞాన్ సంస్థను స్థాపించారు
- పాఠశాల ప్రిన్సిపల్ సీహెచ్ మంజుల





**విశాలభారతి, హైదరాబాద్:**

విజ్ఞాన్ విద్యాసంస్థలు స్థానిక కొండాపూర్ పాఠశాల ప్రాంగణంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్ పర్సన్ రాణి రుద్రమ దేవి, విజ్ఞాన్ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్రాంతి కిరణ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్య అతిథి పాల్గొన్న ప్రొఫెసర్ ఎం. కోదండరాం మాట్లాడుతూ పిల్లల సమగ్రాభివృద్ధి కోసం విజ్ఞాన్ విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయని అన్నారు. క్యాంపస్ అంటే ఇరుకు గదులు కాదు, పచ్చని ప్రశాంతమైన వాతావరణం, విశాలమైన ఆవరణం ఉండాలి అని అన్నారు. చదువు అంటే కేవలం మార్కులే కాదు, విలువలతో కూడిన విద్య అవసరమని అన్నారు. వీటన్నిటిని విజ్ఞాన్ సంస్థలు ఆచరిస్తున్నాయని కొనియాడారు ప్రపంచ వ్యాప్తంగా గొప్ప గొప్ప సంస్థలలో ఉన్నత పదవులలో ఉండే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత విజ్ఞాన్ సంస్థలదే అని వారు కొనియాడారు. విజ్ఞాన్ సంస్థలు విలువలతో కూడిన విద్యను అందిస్తుందని తెలియజేశారు. అంతకు ముందు పాఠశాల ప్రిన్సిపల్ సి.హెచ్. మంజుల స్వాగతోపన్యాసం ఇస్తూ చైర్మన్ లావు రత్తయ్య సామాజిక బాధ్యతతో విజ్ఞాన్ సంస్థను స్థాపించారన్నారు. 46 ఏళ్ల నుండి విద్యార్థుల అవసరాలకు తగ్గట్లుగా నూతన విద్యావిధానాలను రూపొందిస్తూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడారంగం, సాంస్కృతిక కార్యక్రమాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ అనేక విజయాలను సాధించారని తెలియజేశారు. గత విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజ్ఞాన్ యందు 6 నుండి 9వతరగతి వరకు చదువుతూ అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు 25% నుండి 100% వరకు మెరిట్ స్కాలర్షిప్ లను ముఖ్య అతిథి ప్రొఫెసర్ ఎం. కోదండరాం చేతుల మీదుగా అందజేశారు. సమాజం పట్ల విద్యార్థుల బాధ్యత, వ్యక్తిత్వ వికాసంతో కూడిన నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవటం అనే అంశాల నేపథ్యంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులకు, అతిథులకు పాఠశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. మంజుల గారు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. సందీప్ క్రాంతి కిరణ్, ప్రిన్సిపల్స్, కోఆర్డినేటర్స్, వైస్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వల్లే మేడిగడ్డ కుంగింది

తరువాయి భాగం

కంటే ఎక్కువగా ఉండడం వల్లే ఆనకట్ట దిగువ భాగాన సీసీబ్లాకులు, అప్రాన్ దెబ్బతిన్నాయని, సమస్యలు అలాగే కొనసాగుతూ వచ్చి ఆ ప్రభావం ఏడో బ్లాక్‌పై పడి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ఆనకట్టలపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీఘోష్ కమిషన్ ముందు ఎల్ అండ్ టీ ప్రతినిధులు విచారణకు హాజరయ్యారు. ఆనకట్ట డిజైన్స్, డ్రాయింగ్స్, లోపాల్, కాఫర్ డ్యాం, ఆనకట్ట కుంగడానికి కారణాలు, లోపాలు, వాటికి చేసిన మరమ్మత్తులు, సబ్ కాంట్రాక్టులు, కుంగిన బ్లాక్ పునరుద్ధరణ తదితర అంశాలపై కమిషన్ వారిని ప్రశ్నించింది. నీటిపారుదల శాఖ ఇచ్చిన డిజైన్స్, డ్రాయింగ్స్ ప్రకారమే మేడిగడ్డ ఆనకట్ట నిర్మించామన్న ప్రతినిధులు భూమిని దశల వారీగా అప్పగించారని, అందుకు అనుగుణంగా పనులు చేశామని చెప్పారు. డిజైన్‌లో అంచనా వేసిన ప్రవాహవేగం కంటే ఎక్కువగా ఉన్నందునే ఆనకట్ట దిగువన అప్రాన్, సీసీ బ్లాకులు దెబ్బతిన్నాయన్న ప్రతినిధులు నీరు నిల్వ చేసిన మొదటి సీజన్ తర్వాతే మేడిగడ్డ ఆనకట్ట దిగువన సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. వాటిని పరిష్కరించేందుకు తగిన డిజైన్స్ ఇవ్వాలని నీటిపారుదల శాఖను పలుమార్లు కోరినట్లు చెప్పారు. నాలుగేళ్లు అయినా నీటిపారుదల శాఖ నుంచి ఎలాంటి స్పందన లేదని, 2019 లోనే లోపాలను పరిష్కరించి ఉంటే మేడిగడ్డ ఆనకట్టకు ఇంత ప్రమాదం వాటిల్లేది కాదని ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఆనకట్టను ప్రారంభించిన తర్వాత నీటిని నిల్వ చేసినప్పటి నుంచి కుంగే వరకు ఆనకట్ట ఎప్పుడూ ఖాళీగా లేదని, ఏడో బ్లాక్ కుంగే వరకు నీరు నిండే ఉందని చెప్పారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
25.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## కౌశిక్ రెడ్డిపై జనాగ్రహం

తరువాయి భాగం: కుర్చీలు విసురుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ శ్రేణులు టమాటాలు, కోడిగుడ్లు విసిరారు. పోటాపోటీగా ఇరుపార్టీ కార్యకర్తల నినాదాలు చేసుకున్నారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసుల కమలాపూర్ గ్రామసభ దగ్గరికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చారు. పోలీస్ ఉన్నతాధికారులు ఎమ్మెల్యేకు నచ్చచెప్పి అక్కడి నుంచి పంపించడంతో గ్రామసభ యథావిధిగా జరిగింది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక కమలాపూర్ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సొంత ఊరు. 2004 ఎన్నికల్లో కమలాపూర్ నుంచి టీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం మల్కాజ్ గిరి నియోజవర్గం నుంచి ఎంపీగా ఉన్నారు.




## విద్యార్థి జీవితంలో క్రీడలు ఎంతో కీలకం

- తెలంగాణ ఒలంపిక్స్ జనరల్ సెక్రెటరీ పి. మల్లారెడ్డి

ఎల్బీనగర్ విశాలభారతి: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే ఆటలు ఎంతో కీలకమని,శరీరానికి వ్యాయామం కావాలంటే విద్యార్థులు రోజూ ఆటలు ఆడాలని శరీరానికి కావాలని ప్రతిరోజూ క్రీడల్లో పాల్గొనాలని తెలంగాణ ఒలంపిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పి. మల్లారెడ్డి అన్నారు. ఆక్స్ఫర్డ్ స్కూల్ ఎల్బీ నగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం..సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో స్కూల్ 26 వ వార్షికోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ ఈవెంట్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్స్ రీజినల్ ఇన్చార్జి ఆరోగ్యారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఆక్స్ఫర్డ్స్కూల్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఈవెంట్స్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 3 రాష్ట్రాల్లో ఆక్స్ఫర్డ్ స్కూల్కు 35 బ్రాంచ్ లు ఉన్నాయని చెప్పారు. పిల్లలకు వ్యాయామం లేకపోతే మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుందన్నారు. అందుకే పిల్లలు తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆక్స్ఫర్డ్ స్కూల్ కరస్పాండెంట్ ఫ్రాన్సిస్ రెడ్డి, మేనేజ్మెంట్ విజయ భాస్కర్ రెడ్డి, జోసఫ్ రెడ్డి, పీఈటీ, టీచర్లు పుణ్యవతి, గీత, రెహానా, పద్మావతి, లీలా లక్ష్మి, శివ. ప్రదీప్ పాల్గొన్నారు.



## నిరుపేద రోగులకు అన్నదానం

- డాక్టర్. సయ్యద్ మసీదుల్లా హుస్సేని
- ఎంఎన్ జే క్యాన్సర్ ఆసుపత్రి

హైదరాబాద్,విశాలభారతి: అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్. సయ్యద్ మసీదుల్లా హుస్సేని ఆధ్వర్యంలో ఎంఎన్ జే క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో నిరుపేద రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ కీర్తిశేషులైన తల్లిదండ్రుల పేరు మీద వివిధ కార్యక్రమాలు చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని, కుటుంబ సభ్యుల, మిత్రుల ప్రభుత్వ ఉద్యోగుల ప్రోతబలంతో మంచి మంచి కార్యక్రమాలు చేస్తున్నందుకు భగవంతునికి సదా రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బెంజమిన్, హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కే.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి వైదిక్ శాస్త్ర, సభ్యులు ముఖీమ్ ఖురేషి, శ్రీధర్ నాయుడు, కేంద్ర సంఘ క్రీడా కార్యదర్శి బోలిగిద్ద శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హౌస్ అరెస్ట్

- రోడ్డులో పోతున్న ప్లాట్ల వేలం ప్రక్రియను నిలిపివేయాలి
- వేలం పాటను అడ్డుకుంటామని హెచ్చరించిన మాధవరం
- హౌసింగ్ బోర్డు రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ మారిందంటూ ఎంఎల్ఏ ఫైర్



కూకట్ పల్లి,విశాలభారతి: సామాన్య ప్రజల సొంతింటి కలను నిజం చేయడం కోసం ఏర్పడ్డ హౌసింగ్ బోర్డు రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థగా మారి మోసపూరితంగా భూములును అమ్మడం పట్ల ఏమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ మండలి (TSHB) మోసపూరిత వైఖరిని ఎండగడుతూ రోడ్డులో పోతున్న ప్లాట్ల వేలం ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వేలం పాట ను అడ్డుకుంటామని ప్రకటించిన కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తో పాటు నియోజకవర్గం లోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్పొరేటర్లు, ముఖ్యనాయకులను పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. ఉదయం ఆరుగంటల నుంచి పెద్దయెత్తున పోలీసులను మోహరించి ఎక్కడిక్కడ హౌస్ అరెస్ట్ చేశారు. అయినప్పటికీ వందలాదిగా నాయకులు కార్యకర్తలు ఎం ఎల్ ఏ మాధవరం కృష్ణారావు నివాసానికి తరలివచ్చారు. దీంతో పోలీసులు ఇంటికి నలువైపులా బారికేడ్లను ఏర్పాటు చేసి నాయకులు కార్యకర్తలను నియంత్రించేందుకు ప్రయత్నించారు. కూకట్పల్లి ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నలుగురు ఇన్స్పెక్టర్లు నాలుగు పోలీసుస్టేషన్ల సిబ్బందిని మొహరించి వేలం పాట కు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మీడియాతో మాట్లాడుతూ కూకట్పల్లి నియోజకవర్గంలో సామాన్య ప్రజలు హౌసింగ్ బోర్డు చేతిలో మోసపోవద్దని సూచించారు. ఏకంగా హుడా మాస్టర్ ప్లాన్ లో 100 ఫీట్లు రోడ్డుగా చూపిన kphb 15 వ ఫేస్ లోని ఖాళీ స్థలాలను, 200 ఫీట్ల రోడ్డుగా చూపిన 7 వ ఫేస్ లోని ఖాళీ స్థలాలను మోసపూరితంగా 80 అడుగుల రోడ్డుగా చూపుతూ రోడ్డు స్థలాలను అమ్మకానికి పెట్టడం హౌసింగ్ బోర్డు అధికారుల నీతి మాలిన చర్యకు నిదర్శనమన్నారు. గడిచిన ఐదు రోజులుగా రోడ్డు స్థలాలను వేలం వేయొద్దని, సామాన్య ప్రజలను మోసం చేయొద్దని హౌసింగ్ బోర్డు అధికారులను కోరినప్పటికీ పట్టించుకోకపోవడంతో వేలాన్ని అడ్డుకుంటామని ప్రకటించినట్లు తెలిపారు. 80 ఫీట్ల రోడ్డుగా నమ్మించి అమ్ముతున్న ఖాళీ స్థలాలను కొనుగోలు చేసిన వారు రోడ్డు విస్తరణతో ప్లాట్లను కోల్పోతారని అప్పుడు ghmc ద్వారా నష్టపరిహారం ఇప్పించాలని రోడ్డు ఎక్కుతారని ఇవ్వని ముందస్తుగా గ్రహించి హౌసింగ్ బోర్డు అధికారులు రోడ్డులో పోయే ప్లాట్లను వేలం నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యయుతంగా నిబంధనల మేరకు హౌసింగ్ బోర్డు స్థలాల వేలంలో పాల్గొనేందుకు బ్యాంకు ద్వారా డిడి తీసుకునప్పటికీ అనుమతించకపోవడం ప్రభుత్వ అడ్డగోలు విధానాలకు అద్దం పడుతుంది. పోలీసులు కూడా పరిధి దాటి వ్యవహరిస్తున్నారనీ, చట్టప్రకారం వేలం పాట లో పాల్గొనే హక్కు ఉన్నప్పటికీ అనుమతించకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విమర్శించారు. ఇప్పటికైనా హౌసింగ్ బోర్డు అధికారులు తమ తప్పును తెలుసుకొని వెంటనే రోడ్డు స్థలాల వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.






## ప్రతి ఓటమి విజయానికి తొలి మెట్టు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ క్యాంపస్ ప్లేస్మెంట్స్

పటాన్ చెరు,విశాలభారతి విద్యార్థి దశనుండే మానసిక ధైర్యం పెంపొందించుకోవాలని.. ప్రతి ఓటమి విజయానికి తొలిమెట్టు లాంటిదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన క్యాంపస్ ప్లేస్మెంట్స్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రమైన పటాన్ చెరులో నిరుపేద మధ్యతరగతి ప్రజల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడంలో భాగంగా కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు క్యాంపస్ ప్లేస్మెంట్స్ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదగ్గ పరిణామం అన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుంటూ ముందుకు వెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా జస్ట్ డయల్,. పేటీఎం, టెక్ మహీంద్రా సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూలో డిగ్రీ కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ఉద్యోగాలు సంపాదించారు. మీరందరికి ఎమ్మెల్యే జీఎంఆర్ చేతులమీదుగా ప్లేస్మెంట్ లెటర్లు అందించారు.. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, ప్రవీణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుంది

- త్వరలో క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ యూనివర్సిటీ
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలం బాటసింగారం గ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128 వ జయంతిని పురస్కరించుకొని గురువారం ఏర్పాటుచేసిన కబడ్డీ టోర్నమెంట్ ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఒక క్రీడాకారుడిగా క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలియజేశారు . కబడ్డీ క్రీడా జాతీయ క్రీడ అని గ్రామీణ ప్రాంత క్రీడాకారులు కబడ్డీకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని అన్నారు . తెలంగాణ రాష్ట్రంలో త్వరలో క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ యూనివర్సిటీ మరియు స్పోర్ట్స్ అకాడమీ నెలకొల్పుతున్నట్లు తెలియజేశారు. బాటసింగారం గ్రామం లో సమస్యలు లేకుండా చూస్తానని అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందజేస్తారని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా టాస్ వేసి కబడ్డీ క్రీడలను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గడ్డి గన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్ గౌడ్,పెద్ద అంబర్ పేట మున్సిపల్ చైర్ పర్సన్ పండుగల జయశ్రీ రాజు, వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరాచారి, మాజీ ఎంపీపీ బుర్రరేఖ మహేందర్ గౌడ్, మాజీ జెడ్పిటిసి సభ్యులు బింగి దేవదాస్ గౌడ్, స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యులు కేశెట్టి వెంకటేష్, కొ ఆప్షన్స్ సభ్యులు గౌస్ పాషా, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు గ్యారల శ్రీనివాస్, సుప్ర సేన రెడ్డి, వడ్డేపల్లి విద్యా విజయేందర్ రెడ్డి, పసుల రాజేందర్,మాజీ ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులతోపాటు నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు మోడెపు గణేష్ గౌడ్ మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణం

- ముఖ్య అతిథిగా ఈటల రాజేందర్
- అమ్మవారి విగ్రహ ప్రతిష్టకు ఆహ్వానం పత్రిక

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి: హయత్ నగర్ మండల్ ఆఫీస్ ఆవరణలో ఉన్నటువంటి శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణం సందర్భంగా 16 ఫిబ్రవరి 2024 రోజున జరగనున్న అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ని ముఖ్య అతిథిగా పాల్గొనాలని, హయత్ నగర్ డివిజన్ కార్పోరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సమక్షంలో దేవాలయ కమిటీ సభ్యులు ఈటల రాజేందర్ ని వారి కార్యాలయంలో కలసి ఆహ్వాన పత్రికను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పారంద స్వామి , అధ్యక్షులు ఎర్ర రవీందర్ , ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్ , క్రిష్ణ , పిట్టల జంగం, నాగభూషణం, పారంద క్రిష్ణ, మధు, మార్కండేయ మరియు తదితరులు పాల్గొన్నారు.



## సిసి రోడ్ల నిర్మాణ పనులను పరిశీలన

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

కూకట్ పల్లి, విశాలభారతి: హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని సమత నగర్ కాలనీ లో సుమారు 22.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం కాలనీ వాసులతో కార్పొరేటర్ శ్రీ నార్నె శ్రీనివాస రావు పరిశీలించారు. ఈ సందర్భంగా నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో డివిజన్ లో అత్యవసరం ఉన్న చోట ప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని నార్నె శ్రీనివాసరావు తెలిపారు. ఇలాంటి సమస్య ఉన తన దృష్టికి వస్తే పరిష్కరిస్తామన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని నార్నె శ్రీనివాసరావు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని నార్నె శ్రీనివాసరావు తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నివేళలా ప్రజలకు అందుబాటులోకి ఉంటానన్నారు.మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, అదే విధంగా హైదర్ నగర్ డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్గా తీర్చిదితామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మరెడ్డి

నాచారం,విశాలభారతి: గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మరెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ డివిజన్ లో కౌడన్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాలెండర్ ఆవిష్కరణ మరియు గౌడ సంఘం భవనం ప్రారంభంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, హెచ్ బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
25.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com

vishalabharathi Telugu Daily


## ముల్కనూర్ ప్రజా గ్రంథాలయానికి పదివేల విరాళం



**భీమదేవరపల్లి విశాలభారతి**

మండలంలోని ముల్కనూర్ ప్రజా గ్రంధాలయానికి అనంతసాగర్ సుమతీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీ రెడ్డి శుక్రవారం పది వేల చెక్కును మాజీ జెడ్పిటిసి వంగ రవీందర్ కు అందజేశారు. పోటీ పరీక్ష పుస్తకాల కోసం పదివేల రూపాయల చెక్కుని కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మూల రాముతో కలిసి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో దార్న శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఘటనపై విచారణ కొనసాగుతోంది

- దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం
- 43 మందిని గుర్తించి కేసులు నమోదు చేశాం
- నాయకులు సమన్వయం పాటించాలి
- హైదరాబాద్ మల్టిజోన్ 2 ఐజీ సత్యనారాయణ



**పటాన్ చెరు,విశాలభారతి**

పటాన్ చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దాడి ఘటనపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తు చేపట్టి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ మల్టీజోన్ 2 ఐజి సత్యనారాయణ అన్నారు. హింసాత్మక సంఘటనలను ఉపేక్షించేది లేదని ఐజి హెచ్చరించారు. పటాన్ చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి నేపథ్యంలో ఐజి సత్యనారాయణ శుక్రవారం పర్యటించారు. పటాన్ చెరు పోలీస్ స్టేషన్ ను సందర్శించి గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన దాడికి సంబంధించిన వివరాలను సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్, పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పటాన్ చెరు పోలీస్ స్టేషన్ లో రికార్డులను పరిశీలించి క్రైమ్ రేట్ తో పాటు ట్రాఫిక్ నియంత్రణకు, భద్రతకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐజీ సత్యనారాయణ మాట్లాడుతూ...గద్వాల్, పటాన్ చెరు మినహా తమ జోన్ పరిధిలో ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంతంగా జరిగాయన్నారు. పటాన్ చెరు పట్టణంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన నిరసన కార్యక్రమం సందర్భంగా పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి గొడవలు జరగకుండా నియంత్రించారని చెప్పారు. అందులో కొందరు ఆందోళనకారులు అకస్మాత్తుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఆందోళన నిర్వహించారని, అప్పటికి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారని తెలిపారు. అయినప్పటికీ కొందరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం చేశారన్నారు. ఇందుకు కారణమైన 43 మందిపై ఇప్పటికే కేసు నమోదు చేసినట్టు ఐజి తెలిపారు. నాయకులంతా సమయమనం పాటించాలని సూచించారు.


క్యాంపు కార్యాలయం వద్ద ఘటన జరగటం వెనుక ఉన్న శక్తులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఐజి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్, పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, పటాన్ చెరు సీఐ వినాయక రెడ్డి, క్రైమ్ సీఐ రాజు, తదితరులు పాల్గొన్నారు.




## ఓవర్ లోడింగ్‌పై వాహన చోదకులకు అవగాహన

**సూర్యాపేట, విశాలభారతి**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఈనాడు జంక్షన్ వద్ద వాహన చోదకులకు శుక్రవారం ఓవర్ లోడింగ్ పై ఎస్సై సాయిరాం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సై సాయిరాం మాట్లాడుతూ... హైవేలపై తిరిగే వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళితే కఠిన చర్యలు తప్పవన్నారు. హైవేలపై ఓవర్ లోడింగ్ తో వెళ్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. సీటింగ్ కెపాసిటీకి మించి ప్రయాణించి ప్రమాదాల బారిన పడకుండా, ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయాలని కోరారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- ప్రభుత్వ పథకాలకు ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలి
- 48 వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న

**సూర్యాపేట, విశాలభారతి**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తుందని 48 వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందించనున్న వివిధ సంక్షేమ పథకాల అర్హుల జాబితాను ఎంపిక చేసేందుకు గాను శుక్రవారం 48వ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రజా పాలనలో ఎవరు ఏ పథకానికి దరఖాస్తు చేసుకున్నారో వారి పేర్లను మాత్రమే వార్డు సభల్లో అధికారులు ప్రకటిస్తున్నారని తెలిపారు. అధికారులు చదివి వినిపించిన జాబితాలో పేర్లు లేని వారు ఏ సంక్షేమ పథకాలకు అర్హులవుతారో గుర్తించి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ప్రజలు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో రాపర్తి నాగరాజు, బొమ్మిడి అశోక్, షేక్ మీరా, ఆర్పి మంత్రాల పద్మ, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు

**విశాలభారతి ఎల్కతుర్తి**

ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పదవి బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ కుమార్ ను బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల అధ్యక్షులు పిట్టల మహేందర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, రైల్వే బోర్డు సభ్యులు ఏల్తూరి స్వామి, మాజీ వైస్ ఎంపీపీ తంగేడ నగేష్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తంగెడ మహేందర్, బిఆర్ఎస్వి నియోజకవర్గ ఉపాధ్యక్షులు గోడిశాల వినయ్ గౌడ్, మండల యూత్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు చెవుల తిరుపతి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సాతూరి శంకర్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు మదార్, ఒడితల యువసేన అధ్యక్షులు చిట్టి గౌడ్, సీనియర్ నాయకులు మదన్ మోహన్ రావు, సాంభమూర్తి గౌడ్, దేవేందర్ రావు, రవీందర్రావు, కోరే రాజ్ కుమార్, ఊట్కూరి కార్తీక్, మహిళా నాయకులు మేరీ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



## అభివృద్ధి పనుల్లో నాణ్యతలు పాటించాలి

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

హైదర్ నగర్ డివిజన్ అభివృద్ధి కొరకు ఎల్లవేళలా కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు అన్నారు. డివిజన్ పరిధిలోని సమత నగర్ కాలనీ లో రూ. 22 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, కాలనీ వాసులతో కలసి నార్నె శ్రీనివాస రావు శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా నార్నె మాట్లాడుతూ, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో డివిజన్ లో అత్యవసరం ఉన్న చోట, నిత్యం సమస్యల తో ఉన్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని తెలియచేశారు.ఏ చిన్న సమస్య ఐనా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానన్నారు.కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుకెళ్లి, ఆదర్శవంతమైన కాలనీలు గా తీర్చిసిద్ధుతానన్నారు. అలానే అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని,ప్రజలకు స్వచ్ఛమైన,చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామన్నారు.పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు,కాలనీ వాసులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**వాజేడు, విశాలభారతి:**

మండల కేంద్రంలోని నాగారం పంచాయతీ సిబ్బంది అయినా వాసం నీలాద్రి భార్య ఇటీవల ప్రమాదవశత్తు గాయపడి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని శుక్రవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి మనోధైర్యాన్ని పెంపొందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాదరాజు మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాట్ల వాసు బాబు మాజీ జెడ్పిటిసి తల్లడి పుష్పలత మాజీ ఎంపీపీ శ్యామల శారద సొసైటీ ఉపాధ్యక్షులు జగన్నాథరాజు కాంగ్రెస్ నాయకులు చెన్నం ఎల్లయ్య కాకర్లపూడి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



## కడవెండి లో పెన్షన్ దారుల నిరసన

**దేవరపుల, విశాల భారతి**

దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో పింఛన్ పెంపు వంద రోజుల్లోనే ఇస్తామని 13 నెలలైనా ఊసెత్తని కాంగ్రెస్ పై గ్రామ పెన్షన్ లబ్దిదారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ.2 వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో ప్రకటించింది. రూ.4వేలు ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచుతామని చెప్పింది. ఈ హామీలను 100 రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి ఇప్పటికి 13 నెలలు దాటిందని, వెంటనే ఆ పెన్షన్ని పెంచి వచ్చే నెల నుంచి లబ్ధిదారులకు అందించాలని గ్రామ పెన్షన్ లబ్ధి దారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పై నిరసన చేపట్టారు.



## అంబేద్కర్ భవన్ కి భూమి పూజ చేసిన పాయం

**మణుగూరు, విశాలభారతి:**

మండలంలోని గుట్ట మల్లారం గ్రామపంచాయితీ పరిధిలో గల రైతు వేదిక ఎదురుగా ఎస్సీ భవన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్ నిర్మాణానికి శుక్రవారం నాడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కులాలు ఐకమత్యం తో ఉండి అభివృద్ధి చెందాలని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో వారు కల్పించిన రిజర్వేషన్ హక్కులతో ఈరోజు నేను మీ ముందు శాసనసభ్యులుగా మాట్లాడటం జరుగుతుందని, అలాగే భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారనీ, ఎస్సీ భవన నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,సింగరేణి అధికారులు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళా నాయకులు యువజన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంధం ఊరేగింపు ప్రారంభించిన మంత్రి ఉత్తమ్

**పాలకీడు, విశాలభారతి:**



మండలంలోని జాన్ పహాడ్ సైదులు దర్గా ఉర్సు ఉత్సవం లో ప్రధాన ఘట్టం అయిన గంధం తయారీ కార్యక్రమంలో మాజీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ముజావర్ షేక్ సైదా, ముజావర్ సయ్యద్ జానీ తో కలిసి తయారు చేసి,దర్గా నందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తో, మిర్యాలగూడ ఎంఎల్ఏ బియల్ ఆర్ తో కలిసి ఉర్సు లో పాల్కొని గంధం తో ఊరేగించి, దర్గా లో చదర్ కప్పి ప్రత్యేక ప్రార్ధన చేశారు. ఈ సందర్భంగా షేక్ సైదా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జాన్ పహాడ్ ఉర్సు ఉత్సవాలకు వొచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉందని, అట్టి భక్తులకు తగినట్లు వసతులు ఏర్పాటు చేసిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కి, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ కి కృతజ్ఞతలు తెలియజేసారు.

# దేవాలయ షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

**చౌటుప్పల్, విశాలభారతి:**

మున్సిపాలిటీ కేంద్ర లో శ్రీ బాలాజీ రామ కృష్ణ దేవాలయం ఆవరణలో భూమి పూజ ఉదయం11 గంటలకు నిర్వహించడం జరిగింది. తధానంతరం అధ్యక్షుడు నాగిళ్ళ రామచంద్రం మాట్లాడుతూ పాత షెడ్డు తొలగించి నూతన షెడ్డు నిర్మాణం చేయడం జరుగుతుంది. ఈ షెడ్డు నిర్మాణానికి సహకరించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఉదరి శ్యామ్, చింతల ప్రభాకర్ రెడ్డి, ఉష్కాగుల శ్రీను కోశాధికారి కానుగు శేఖర్ ముదిరాజ్, సహాయ కార్యదర్శి తూర్పునూరి మల్లేష్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఆరుట్ల లింగస్వామి, కార్యవర్గ సభ్యులు ఉదరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
25.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చేస్తాం

- **తహశీల్దార్ షబ్బీర్**
- **ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్**

**బాల్కొండ, విశాల భారతి**

అర్హత ఉండి రేషన్ కార్డు,ఇందిరమ్మ ఇండ్లు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో పేరు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చునని భీమ్‌గల్ తహశీల్దార్ షబ్బీర్ అన్నారు. శుక్రవారం ఆయన ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్ తో కలిసి ముచ్కుర్,బెజ్జోర,దేవన్ పల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు.రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల జాబితాలను ప్రజల సమక్షంలో అధికారులు చదివి ఆమోదించారు. గ్రామ సభల్లో ప్రజలు తమ సమస్యలను అధికారుల వద్ద పెట్టారు.ఈ సందర్భంగా తహశీల్దార్ షబ్బీర్,ఎంపిడిఓ సంతోష్ కుమార్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు చేకూరేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షబ్బీర్, ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్, ఎంపిఓ జావేద్ అలి,డిప్యూటీ తహశీల్దార్లు శ్రీనివాస్,అశ్విన్, అధికారులు భీమ్ రావు,నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**బాల్కొండ,విశాలభారతి**

భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.శుక్రవారం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ చొరవతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించి ప్రభుత్వం ఎంతో మందికి ఆర్థికంగా చేదోడుగా నిలిచిందని అన్నారు.అర్హులైన వారందరికీ సీఎంఆర్ఎఫ్ తో పాటు సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి,ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లి మార్కెట్ డైరెక్టర్ కిష్టి చిన్న బాబాన్న,గ్రామ అధ్యక్షుడు రాదే మురళీ,నాయకులు గోవర్ధన్,జూబేర్,సమీర్,అజార్,సలీం, నదీమ్,మెరజ్,కలీం తదితరులు పాల్గొన్నారు.

# రెండు పీడీఎస్యూ వర్గాల విలీనం హర్షనీయం

- **పీడీఎస్యూ మాజీ మండల కన్వీనర్ ఎం.నరసింహ**

**బాల్కొండ, విశాల భారతి**



ఈ నెల 28 న జరిగే రెండు పీడీఎస్యూ రాష్ట్ర కార్యవర్గ విలీన సభ ఎంతో ఆదర్శమని,హర్షనీయం అని భీమ్‌గల్ పీడీఎస్యూ మండల మాజీ కన్వీనర్ ఎం.నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉస్మానియా యూనివర్సిటీ లో పురుడోసుకుని నేడు దేశ వ్యాప్తంగా పీడిత విద్యార్థుల పక్షాన పోరడుతుంది. 50 సంవత్సరాల సుదీర్ఘ పోరాట వారసత్వ సొంతం,రాజ్యం,పాలక ప్రభుత్వాలు ఎంతటి నిర్భంధం ప్రయోగించిన ఎప్పటికప్పుడు వాటికి సవాలు విసురుతూ,తన ప్రత్యేకతను చాటుకుంటుంది. దేశ విప్లవ విద్యార్థి ఉద్యమానికి దిక్సూచిగా నిలిచింది. జార్జి రెడ్డి త్యాగం,జంపాల చంద్రశేఖర్ అమరత్వం అమర వీరుల అంకిత భావం అశేషమైన పీడిత విద్యార్థి లోకాన్ని నేటికీ కదిలిస్తూనే ఉంది.వీరి ఆశయ సాధనలో ఇప్పటి వరకు విడివిడిగా కొనసాగిన రెండు విద్యార్థి సంఘాలు ఇప్పుడు ఒక్కటవ్వడాన్ని హర్షిస్తున్నాను.ఈ రెండు వర్గాలు ఏకమవడాన్ని చూసి ప్రగతిశీల విద్యార్థి అభిమానులు, విద్యావేత్తలు, మేధావులు,విద్యార్థులు కూడా ఆనందం వ్యక్తపరుస్తారని భావిస్తున్నాను. ఈ కలయిక పటిష్టమైన విప్లవ విద్యార్థి ఉద్యమానికి తోడ్పాటు అందిస్తుందని భావిస్తున్నాను. దేశ విప్లవ విద్యార్థి ఉద్యమంలో ఇదొక చరిత్రాత్మకమైన పరిణామం. ఐక్యమవ్వడమే కాకుండా దేశంలో మరిన్ని విప్లవ విద్యార్థి సంఘాలతో ఏకం అవ్వడానికి ప్రయత్నించాలి.ఏకం అవ్వడం ద్వారా మరింత బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తుంది ఈ ఐక్యతను అందరూ విజయవంతం చేసుకోవాలి. గతంలో జరిగిన అన్ని తప్పిదాలను దృష్టిలో పెట్టుకొని, విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి.విద్యా సమస్యల కోసం నిరంతరం పోరాటం చేయాలని అన్నారు.



# బాలికల శ్రేయస్సుకు పాటుపడాలి

**తొర్రూరు, విశాలభారతి:**

బాలికల శ్రేయస్సుకు అందరూ పాటుపడాలని బాలల హక్కుల పరిరక్షణ ఫోరం జిల్లా అధ్యక్షుడు దొనికెన కుమారస్వామి తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని బాలల హక్కుల పరిరక్షణ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకులంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ నవసమాజ ఆడపిల్లలను చదివించడంతో పాటు, వారి రక్షణకు సమాజం కృషి చేయాల్సిన అవసరముందన్నారు. ఆడపిల్లలు, మహిళలు కష్టం కలిగితే 108, 100కు సమాచారం అందించాలని సూచించారు. బాలికలు ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలు నేరమని, వీటిని ప్రోత్సహించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పసునూరి వనజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లల తల్లులను సన్మానించిన అంగన్వాడి సిబ్బంది

**దేవరుప్పల, విశాల భారతి**

అభం శుభం తెలియని పసి మనసులు పూలతోటలో అప్పుడే పరిమళించిన పువ్వులు. అందరూ అనుభవించే బాల్యం భగవంతుడు ఇచ్చిన ఓ అమూల్యమైన వరం. ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాలలో బాలల దినోత్సవం జరుపుకుంటారు. అందులో భాగంగానే నేడు బాలల దినోత్సవం సందర్భంగా దేవరుప్పుల మండలం, ధర్మాపురం గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో పిల్లల తల్లులను అంగన్వాడీ టీచర్,సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ గండిపెల్లి రమాతార,ఆయా జె.విజయ, తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన ప్రజా పరిపాలన సభలు

- **అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు**
- **అభినందిస్తున్న ప్రజానీకం**
- **ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలు నమ్మొద్దు**
- **కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి**

**విశాల భారతి, ఎల్కతుర్తి:**



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయని ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి వెల్లడించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి 20 గ్రామాలలో ప్రజా పరిపాలన సభలు విజయవంతం అయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడవ గ్యారెంటీగా ఇవ్వబోతున్నటువంటి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేనటువంటి నిరుపేదలకు సంవత్సరానికి 12000 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని, నూతన రేషన్ కార్డు 3607, ఇందిరమ్మ ఇండ్లు 4943 మంది అర్హత కలిగి ఉండగా రైతు భరోసా కింద సాగు చేస్తున్నటువంటి ప్రతి భూమికి 12000 జనవరి 26న రైతు ఖాతాలో జమ కాబోతున్నాయని, లిస్టులో వచ్చినటువంటి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని వెల్లడించారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధిని జీర్ణించుకోలేక గ్రామాలలో పనికట్టుకొని అమాయక ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి ఆపోహాలను ప్రజలు నమ్మవద్దని జనవరి 26 తర్వాత ప్రజా ప్రభుత్వం చేస్తున్నటువంటి పనులను చూసి ప్రజలే సమాధానం చెబుతారని తెలిపారు. గత ప్రభుత్వంలో చేసినట్టుగా ప్రజా ప్రభుత్వంలో అధికారపార్టీ నాయకుల ప్రమేయం ఉండదని, అధికారులే స్వయంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు సుఖినే సంతాజీ, మాజీ సింగల్ విండో చైర్మెన్ గోలి రాజేశ్వర్ రావు, గ్రామ శాఖ అధ్యక్షులు అనిల్ కుమార్, మండల యూత్ అధ్యక్షులు అంబాల శ్రీకాంత్ (బక్కి), గోడిశాల యాదగిరి, పాక రమేష్, రాజయ్య గౌడ్, రమేష్ బాబు, శనిగరం వెంకటేష్, స్వరూప,అంబాల స్వామి, మహిళా అధ్యక్షురాలు సుష్మ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాహు, జగన్, కడారి సురేందర్, యాదగిరి, రాజు, సారయ్య, వినయ్, పున్నంచెందర్, వెంకట్, ప్రదీప్, అనిల్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# సిద్ధార్థ విద్యార్థికి కలెక్టర్ ప్రశంసలు

**పాలకుర్తి, విశాలభారతి:**

మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఆర్. సంజయ్ ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ పాషా ప్రశంసించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాస రచనా పోటీలో సంజయ్ ప్రథమ బహుమతి సాధించగా శుక్రవారం జనగామలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్ పాషా చేతుల మీదుగా సంజయ్ ప్రథమ బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భంగా సదరు విద్యార్థిని, పాఠశాల యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాలయం ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్, కరస్పాండెంట్ జక్కుల ఊర్మిళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# నిరుపేదల కూలీలకు అండగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

**వాజేడు, విశాలభారతి:**

మండల పరిధిలోని మురుమూరు గ్రామసభలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొని మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను వర్తింప చేయడానికి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రైతులకు రైతు భరోసా ఇచ్చినట్లే భూమిలేని నిరుపేద కూలీలను గుర్తించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చక్కటి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ ఫలాలు అందించే విధంగా చర్యలు చేపడతామని ఆయన అన్నారు ఎవ్వరు కూడా నిరాశ పడకుండా రానివారు ఎవరైనా ఉంటే మరల దరఖాస్తులు చేసుకోవాలని రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇల్లు కూడా ప్రతి ఒక్క పేదవాడికి అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు. ఎవరు కూడా అధైర్య పడకూడదు అందరికీ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగే విధంగా తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ శ్రీకాంత్,ఏపీవో రాజ్, సీఐ బండార్ కుమార్, ఎస్సై రాజ్ కుమార్, ఈసీ సత్తేందర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి గడ్డం కార్తీక్, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతోనే శారీరక దృఢత్వం

- **ఇంద్రనగర్ అంబేద్కర్ యూత్ అధ్యక్షులు సందెల నరేష్**

**విషాలభారతి, ఎల్కతుర్తి:**

క్రీడలతోనే శారీరక దృఢత్వం అని అంబేద్కర్ యూత్ అధ్యక్షులు సందెల నరేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇందిరా నగర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు అంబాల రాజ్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం క్రికెట్, వాలీబాల్, కోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. క్రీడలతోనే మంచి ఆరోగ్యం, శరీర దృఢత్వం కలిగి ఉంతుందని తెలిపారు. క్రీడా పోటీలతోపాటు ప్రతిరోజు ఉదయం యోగా 5టు 10 కె రన్ లాంటివి చేయాలని కోరారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నటువంటి అంబేద్కర్ యూత్ అధ్యక్షులు సందెల నరేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యూత్ అధ్యక్షులు సందెల నరేష్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్నటువంటి క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి గణతంత్రం దినోత్సవం రోజున బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వచ్చినటువంటి అంబాల రాజ్ కుమార్ తో పాటు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడారి రాజారాం, కడారి ప్రసాద్, మాజీ వార్డు సభ్యులు కడారి సందీప్, బీఆరెఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడారి దాస్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# వినియోగదారుల మన్ననలు పొందాలి

- **పంజాబ్ నేషనల్ బ్యాంక్ డీజీఎం అరవింద్ కర్ల**
- **సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎండి మీలా మహదేవ్**

**సూర్యాపేట, విశాలభారతి**

నాణ్యమైన వస్తు సేవలను అందించి వినియోగదారుల మన్ననలు పొందాలని పంజాబ్ నేషనల్ బ్యాంక్ డీజీఎం అరవింద్ కర్ల, సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎండి మీలా మహదేవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భూమిరెడ్డి హాస్పటల్ ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన గణేష్ ఎంటర్ ప్రైజెస్ ను వారు ప్రారంభించి మాట్లాడారు. పెద్ద పెద్ద నగరాలకు ధీటుగా సూర్యాపేటలో వర్తక వ్యాపారాలు విస్తరిస్తున్నాయని అన్నారు. వినియోగదారుల నమ్మకాన్ని పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని అన్నారు.నూతనంగా ఏర్పాటు చేసిన గణేష్ ఎంటర్ ప్రైజెస్ లో లభించే వస్తు సేవలను వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం గణేష్ ఎంటర్ ప్రైజెస్ ప్రొప్రైటర్ ఎల్వీ ప్రసాద్ మాట్లాడుతూ తమ ఎంటర్ ప్రైజెస్ నందు అన్ని కంపెనీల ఎలక్ట్రికల్స్, పెయింట్స్, సానిటరీ వస్తువులు లభిస్తాయని తెలిపారు.తమ షాప్ నందు తక్కువ ధరలలో గ్యారంటీతో కూడిన నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేసి తాము అందించే సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఇంటికి కావలసిన అన్ని రకాల వస్తువులు లభిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్, నాయకులు గండూరి కృపాకర్, చల్లా లక్ష్మీకాంత్, కక్కిరేణి చంద్రశేఖర్, ఇమ్మిడి శ్రీనివాస్, చల్లా లక్ష్మీప్రసాద్, చీదేళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
25.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## లబ్ధిదారుల ఎంపిక ఇష్టారాజ్యం

ఆర్మూర్,విశాల భారతి



కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలలో లబ్ధిదారుల ఎంపిక ఇష్టారాజ్యంగా జరుగుతుందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఎక్స్ అకౌంట్లో ప్రభుత్వంపై విమర్శలు చేశారు. గ్రామాలలో నిర్వహిస్తున్న గ్రామసభలు గొడవలు పెట్టడానికే అని అన్నారు. గ్రామసభలు సక్రమంగా జరిపినట్టు నిరూపించుకోవడానికి మంత్రులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు.



## లావణ్య మృతి పార్టీకి తీరని లోటు

- తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, విశాలభారతి :

పార్టీ కార్యక్రమాలలో ఎంతో చురుకుగా పాల్గొనే లావణ్య మృతి చాలా బాధాకరం అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. బన్సీలాల్ పేట డివిజన్ భోలక్ పూర్ కు చెందిన బీ ఆర్ ఎస్ పార్టీ మహిళా నాయకురాలు లావణ్య గురువారం సాయంత్రం గుండెపోటుతో మరణించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం భోలక్ పూర్ లోని వారి నివాసానికి వెళ్ళి ఆమె పార్ధీవ దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె భర్త, పిల్లలను పరామర్శించి తన ప్రగాడ సంతాపం, సానుభూతిని తెలిపారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొనే లావణ్య మృతి వార్త తనను ఎంతో కలచివేసిందని చెప్పారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. కార్పొరేటర్ కుర్మ హేమలత, లష్కర్ జిల్లా సాధన సమితి అద్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి, డివిజన్ బీ ఆర్ ఎస్ అద్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, రమణ, శ్రీనివాస్, సాయిబాబా, వెంకట్, మహేందర్, బాసా లక్ష్మి, అనిత తదితరులు లావణ్య మృతదేహం వద్ద నివాళులు అర్పించారు

## పట్టణాలు, గ్రామసభల్లో చదివే జాబితా తుది జాబితా కాదు

- అర్హత ఉండి పేరు రాకపోతే మళ్ళీ దరఖాస్తు చేయండి
- రాంరెడ్డి దామోదర్ రెడ్డి

సూర్యాపేట, విశాల భారతి



పట్టణ, గ్రామసభల్లో చదివే జాబితా తుది జాబితా కాదని.. ఈ నెల 26 నుంచి అమలు కాబోతున్న నాలుగు పథకాల జాబితాలో పేర్లు రాలేదని ఎవరూ అందోళన చెందాల్సిన పని లేదని జాబితాలో పేరు ఉంటే ఉన్నట్లు.. లేకపోతే రానట్లు కాదని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయా పట్టణం,గ్రామాల్లో జరుగుతున్న సభలను ఉద్దేశించి దామోదర్ రెడ్డి మాట్లాడారు. పేదవాళ్ళల్లో బహు పేదవాళ్ళకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇలా ఏ పథకం అయినా అర్హత ఉన్న వారికే అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం జరిగే గ్రామ సభల్లో ప్రకటించే జాబితాలో అర్హత ఉండి పేరు రాకపోతే ఆ గ్రామ సభల్లోనే మళ్ళీ దరఖాస్తు ఫారం పైన దరఖాస్తులు రాసి ఇచ్చినా వాటి ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రం అంతా ఇదే పద్ధతి అవలంభించడం జరుగుతుందని తెలిపారు. జాబితాలను ప్రకటించే క్రమంలో కొన్ని పొరపాట్లు దొర్లిన మాటలు వాస్తవమేనని వాటిని సవరించేందుకే మళ్ళీ పట్టణ, గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇది నిరంతర ప్రక్రియ అని, విడతల వారీగా ప్రజా ప్రభుత్వంలో ప్రతీ పేదవానికి న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ప్రతిపక్షం కావాలనే అనవసర రాద్ధాంతాలు సృష్టించుతుందని పేర్కొన్నారు. పేదవాడికి మంచి చేసే ప్రభుత్వాన్ని విమర్శించడం తగదన్నారు. ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా ఒక పేదవాడికి కూడా న్యాయం చేయలేకపోయిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు ప్రజా ప్రభుత్వం చేస్తుంటే చూసి ఓర్వలేక అవాకులు చవాకులు పేలుస్తుందన్నారు.



## భూమి లేని రైతు కూలీలకు రూ.12 వేలు

- రాష్ట్ర ఖనిజా అభివృద్ధి చైర్మన్ అనిల్ ఈరవత్రి

బాల్కొండ,విశాలభారతి

దేశంలోనే మొదటిసారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ఖనిజా అభివృద్ధి చైర్మన్ అనిల్ ఈరవత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు,రైతు భరోసా ,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సందర్భంగా మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రజాపాలన గ్రామ సభలో రాష్ట్ర సహకార లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖనిజా అభివృద్ధి చైర్మన్ అనిల్ ఈరవత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు అని వారు గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చార అని ప్రశ్నించారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 10 వేలు 12 వేలకు పెంచడం జరిగిందని అన్నారు. దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందని అన్నారు. రైతులకు 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశామన్నారు.ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. సన్న వడ్లకు 500 బోనస్ ఇచ్చామని, గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశారని తెలిపారు. ప్రజలు ఎవరు అధైర్యపడవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తిస్తాయని అన్నారు. ఎవరికైనా అర్హత ఉండి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారుల ఉంటే అధికారులకు మీ పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని తెలిపారు. కింది స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేషన్ కార్డుల,ఇందిరమ్మ ఇళ్ల పై జరుగుతున్న తప్పుడు సమాచారంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లి మార్కెట్ చైర్మన్ వలేపు నర్సయ్య, వేల్పూర్ మార్కెట్ చైర్మన్ ముత్యం రెడ్డి, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం

- సూర్యాపేట డిఎస్పి జి.రవి

సూర్యాపేట, విశాలభారతి



జర్నలిస్టులు స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సూర్యాపేట డిఎస్పి జి.రవి అన్నారు. శుక్రవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక సీతారాంపురం లో గల ఎంపిఎం పాఠశాలలో 9వ తరగతి 10 వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు 100 మందికి ఉచితంగా ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఎలాంటి వేతనాలు లేనప్పటికీ ప్రభుత్వ ప్రజాసేవ ఉచితంగా చేస్తున్న జర్నలిస్టులు సమాజానికి ఆదర్శంగా నిలబడతారని తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా విద్యార్థులకు ప్యాడులు, పెన్నులు పంపిణీ చేసిన అసోసియేషన్ కమిటీ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఇంకా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తాము చదువుకున్న కాలంలో ఎంతో పేద స్థితిలో ఉండి కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చామని, ప్రస్తుతం ఇంత మంచి సౌకర్యాలతో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో 10/10 మార్కులు సాధించిన విద్యార్థులకు మంచి బహుమతి ఇస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి ముందు టీఎస్ జే ఏ నాయకులు డి.ఎస్.పి ని బొకేతో ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వార్షికోత్సవ కార్యక్రమానికి స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. అందులో భాగంగానే పేద విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల సంక్షేమం కోసమే తమ అసోసియేషన్ పనిచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాకయ్య, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అదేవిధంగా అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధూపాటి శ్యాంబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగంపల్లి నాగబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్ ఉద్దీన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం బాలు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గట్టిగుండ్ల రాము,రాష్ట్ర సహాయ కార్యదర్శి చిలుకల చిరంజీవి, సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడి రవి, సూర్యాపేట నియోజకవర్గ నాయకులు దేశగాని వెంకట్ గౌడ్,తాప్సి అనిల్, పడి శాల నాగయ్య, యాతాకుల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు వరం సీఎం సహాయనిధి

- స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, విశాలభారతి :

ఆరోగ్యశ్రీలో లేని, వైద్య సేవల ఖర్చులు భరించలేని పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని స్థానిక కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం మంగళపల్లి గ్రమానికి చెందిన తిప్పిరెడ్డి అఖిల్ రెడ్డి కి 60000 (అరవై వేల) రూపాయల చెక్కును, వివిధ మండలాలకు చెందిన బాధితునికి స్థానిక శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డితో పాటు ఆమనగల్లు మండల మాజి ఎంపీపీ జక్కు అనంత రెడ్డి, మాలేపల్లి మాజీ సర్పంచ్ రమణా రెడ్డి కలిసి ఎమ్మెల్యే చేతుల మీదుగా సీఎం సహాయ నిధుల చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. పేదలకు వరం సీఎం సహాయ నిధి అని, పేద ప్రజల ఆరోగ్యం గురించి అలోచించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండల నాయకులు పాల్గొన్నారు.




## మున్నార్ కో-ఆపరేటివ్ సర్వీస్ సొసైటీ పనితీరు అద్భుతం

ఆమనగల్లు, విశాల భారతి :

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి ఏర్పాటుచేసిన విజ్ఞాన యాత్రలో భాగంగా పాలకవర్గం ఉమ్మడి జిల్లాలోని సింగల్ విండో చైర్మన్లు కేరళ రాష్ట్రంలోని పలు ప్రాథమిక సహకార సంఘాల పనితీరును పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కేరళలోని మున్నార్ కోఆపరేటివ్ సర్వీస్ సొసైటీ పనితీరును ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తాలు ఉమ్మడి పాలమూరు జిల్లా పిఎసిఎస్ చైర్మన్ ల ఫోరం అధ్యక్షులు పోతుల మధుసూదన్ రెడ్డి డిసిసిబి పాలకవర్గం పలు సహకార సంఘాల పనితీరును పరిశీలించారు. ఇందులో భాగంగా మున్నార్ కోఆపరేటివ్ సర్వీస్ సొసైటీ పనితీరు అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. ఈ సొసైటీలో రైతులకు అత్యధికంగా రూ .73 కోట్ల రుణాలను అందజేశారు. అదేవిధంగా రూ. 75 కోట్ల (ఎఫ్డి) ఫిక్స్ డిపాజిట్ లను జమ చేశారని కార్మికులకు పర్సనల్ లోన్ సదుపాయం క్యాష్ క్రెడిట్ లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ పాలసీ కూడా ఆర్బిఐ నిబంధన ప్రకారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి బ్యాంకులో.. పిఎసిఎస్ సంఘాల పాలకుల ద్వారా చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సంఘాలలో ప్రధానంగా అల్లం, మిరియాలు, కొబ్బరి తదితర ఉపాధి అవకాశాలకు రైతుల పొలాన్ని మార్టిగేట్ చేసుకొని మార్కెట్ విలువలలో 40 శాతాన్ని రైతులకు ఓ డ్రాఫ్ట్ ద్వారా లేదా క్యాష్ క్రెడిట్ ద్వారా రైతులకు రుణాలు అందజేస్తున్నట్టు మున్నార్ కోఆపరేటివ్ సర్వీస్ సొసైటీ సీఈవో రాణి తెలిపారు. ఈ విజ్ఞాన యాత్రలో డిసిసిబి డైరెక్టర్లు చైర్మన్లు, పిఎసిఎస్ చైర్మన్లు అశోక్ రెడ్డి తదితరు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు, విశాల భారతి :

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ కర్మన్ ఘాట్ లక్ష్మీ కన్వెన్షన్ సెంటర్ లో శ్రీ సూరిశెట్టి బాలమణి సింహయ్య గుప్తా ఆధ్వర్యంలో, శ్రీ మురుకుంట్ల రాజేశ్వర శర్మ యజ్ఞ పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన 1935వ సర్వ సౌభాగ్య శ్రీ దేవి త్రయ జ్ఞాన యజ్ఞ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మి నర్సింహ్మా రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. పురోహితుల వేద మంత్రోచ్ఛరణలతో యజ్ఞ పతాక పూజ,గోపూజ నిర్వహించి అఖండ దీపారాధనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక జీవనంలో మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక చింతన మనిషికి ఎంతో అవసరమని అన్నారు. నిర్వాహకులు లోక కళ్యాణార్ధం మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ మహా యజ్ఞం చాలా గొప్ప కార్యక్రమమని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మనం చేపట్టే ఎలాంటి కార్యకలాపాలకైనా మన ఆలోచనలే ఆధారమని అవి మంచివైతే సత్సంకల్పాలకు శ్రీకారం చుడతాయని, చెడువైతే దుర్మార్గాలను ప్రేరేపిస్తాయని అందువలన ఆలోచనలకు ఆధ్యాత్మికత తోడైతే అవి ఆత్మాన్వేషణ దిశగా మరలతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ సర్పంచ్ తిరునగరి వేణుగోపాల్, లక్ష్మయ్య గుప్తా, శ్రీనివాస్ గుప్తా, జ్ఞానేశ్వర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

దేవరుప్పుల, విశాల భారతి

దేవరుప్పుల మండలం సింగరాజు పల్లి మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించబడింది. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ అంబటి అంజయ్య మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత పౌరులుగా ఎదగాలని విద్యార్థుల ఉపాధ్యాయులుగా పనిచేయడం వలన, సత్ప్రవర్తన, చదువు పట్ల ఆసక్తి, విషయావగాహన, నాయకత్వ లక్షణలు, భవిష్యత్తులో ఒక లక్ష్యం ఏర్పడతాయని, తెలిపారు. ఈ కార్యక్రమంలో నేడు ఉపాధ్యాయులుగా పదిమంది విద్యార్థులు బోధించారు. డీఈవో గా అరుశ్ తేజ్ యాదవ్, హెచ్ఎం గా ప్రణవి, ఉపాధ్యాయులుగా కీర్తన, లాస్య, ఉమాదేవి, రిషిక, అభిషేక్, పిఈటి గా సాత్విక్, కార్యాలయ సిబ్బందిగా అఖిల్, ప్రేమ్ వర్షిత్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మాధవి, చైతన్య, సునీత, మరియు పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక





# మా నాన్న నన్ను గుర్తుపట్టలే...

రామ్ నారాయణ్ దర్శకత్వంలో విష్వక్సేన్ నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'లైలా' చిత్రాన్ని సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఆకాంక్ష శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. చిత్ర నిర్మాణం ఇప్పటికే పూర్తి చేసుకోగా, ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీ నుంచి 'ఇచ్చుకుందాం బేబీ.. ముద్దు ఇచ్చుకుందాం బేబీ' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను గురువారం విడుదల చేశారు. ఈ చిత్రంలో విష్వక్ అబ్బాయిగా, అమ్మాయిగా రెండు కోణాలున్న పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ సందర్భంగా విష్వక్సేన్ మాట్లాడుతూ.. తన కేరీర్ లో ఇంత ఫన్ రైడ్ మూవీ చేయలేదన్నారు. లేడీ గెటప్‌లో తనని తన తండ్రి కూడా గుర్తు పట్టలేదని అన్నారు. మూవీ కోసం లైలా (లేడీ) గెటప్ వేసుకున్న తర్వాత మా నాన్నకు వీడియో కాల్ చేయగా, గుర్తు పట్టలేదని, లేడీ గెటప్‌లో ఉన్న తాను డాడీ అని పిలిచే సరికి ఆయన ఒక్కసారిగా కంగారు పడ్డారన్నారు. ఈ మూవీ అందరికీ కచ్చితంగా నచ్చుతుందని పేర్కొన్నారు.

సింహ, లెజెండ్, అఖండ లాంటి బ్లాక్ బస్టర్‌లను అందించిన బోయపాటి శ్రీను తో మళ్లీ చేతులు కలిపాడు బాలయ్య. ఈ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'అఖండ 2 – తాండవం' . బ్లాక్ బస్టర్ చిత్రం అఖండ సినిమాకు సీక్వెల్‌గా ఈ మూవీ తెరకెక్కనుంది. ఈ మూవీలో మలయాళ భామ సంయుక్త నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా సంయుక్త పోస్టర్‌ని పంచుకుంది. ఇక ఈ సినిమాను 14రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట BB4 నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి బాలయ్య కూతురు తేజస్విని కూడా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అఖండ తరువాత ఈ సినిమా వస్తుడటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఈ చిత్రం పొలిటికల్ టచ్‌తో ఉండబోతున్నట్లు తెలుస్తుంది.



# ముగ్గురు పిల్లలను కనాలని ఉంది



అలనాటి అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ గురించి పెద్దగా పరిచయం అవసరం లేదు. శ్రీదేవి వారసురాలిగా సినీరంగ ప్రవేశం చేసిన జాన్వీ.. తనదైన నటనతో కొద్ది సమయంలోనే అగ్ర హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం బాలీవుడ్, టాలీవుడ్ అనే తేడా లేకుండా వరుస సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్నది. తెలుగులో దేవర మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. రామ్ చరణ్ సరసన నటిస్తున్నది. తాజా కరణ్ జోహార్ షోలో జాన్వీ కపూర్ పాల్గొన్నది. ఈ సందర్భంగా పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తనకు తిరుపతిలో పెళ్లి చేసుకోవాలని ఉందని తన కోరికను బయటపెట్టింది.ముగ్గురు పిల్లలను కనాలని ఉందని.. పిల్లలు, భర్తతో కలిసి తిరుమలలోనే హాయిగా గడపాలని ఉందని చెప్పింది. నిత్యం అరటి ఆకులో భోజనం చేస్తూ.. గోవిందా గోవిందా అని స్మరించుకోవాలని ఉందని తెలిపింది. మణిరత్నం సినిమాల్లోని పాటలు వింటూ కూర్చోవాలని ఉందని చెప్పుకొచ్చింది. తన భర్తను లుంగీలోనే చూడాలని ఉందని.. చూసేందుకు చాలా రొమాంటిక్‌గా ఉంటుందని జాన్వీ చెప్పుకొచ్చింది. ఇదిలా ఉండగా.. జాన్వీ కపూర్‌కు తిరుమల వేంకటేశ్వరస్వామి అంటే ఎనలేని భక్తి. సమయం దొరికినప్పుడల్లా తిరుమలను సందర్శిస్తుంటారు. జాన్వీ కపూర్ తెలుగులో 'దేవర-1'లో నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రామ్ చరణ్ 16 మూవీలో నటిస్తున్నది. బాలీవుడ్‌లో సన్నీ సంస్కారీ కి తులసీ కుమారి మూవీలో నటిస్తున్నది.



# భిన్నంగా మెడికల్ రిపోర్టు

బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్ పై దాడి కేసులో పోలీసులు నటుడి స్టేట్ మెంట్ ను రికార్డు చేశారు. ఆసుపత్రి నుంచి కోలుకుని ఇంటికి వచ్చిన సైఫ్ ను పోలీసులు కలుసుకున్నారు. దాడి జరిగిన రోజు ఏం జరిగిందనే వివరాలను అడిగి రికార్డు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. దుండగుడు తన కొడుకు జహంగీర్ గదిలోకి చొరబడినట్లు సైఫ్ తెలిపారు. దుండగుడిని తొలుత ఆయా గుర్తించిందన్నారు. ఆ సమయంలో తాను, తన భార్య కరీనా పదకొండో అంతస్తులోని తమ బెడ్ రూమ్ లో నిద్రిస్తున్నామని చెప్పారు. ఆయా అరుపులు విని తామిద్దరమూ కిందకు పరిగెత్తుకెళ్లామని వివరించారు. దుండగుడు రూ.1 కోటి డిమాండ్ చేశాడని, అతడితో తాను కలబడ్డానని సైఫ్ పేర్కొన్నారు. దుండగుడిని కదలకుండా పట్టుకుని బంధించే క్రమంలో తనపై కత్తితో దాడి చేశాడని చెప్పారు. కత్తిపోట్ల కారణంగా తాను పట్టు సడలించడంతో దుండగుడు పారిపోయాడని సైఫ్ చెప్పారు. ఆ సమయంలో తనతో పాటు కరీనా, ఆయా, తన కొడుకు జహంగీర్ ఉన్నారని తెలిపారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.